సాక్షి
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 12 । జనవరి । 2023



సంక్రాంతి సమ్మోహనం

భవానీ ద్వీపంలో సందడి షురూ

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అనుబంధ సంస్థ భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ ద్వీపంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సందడి ఈవెంట్ బుధవారం ప్రారంభమయ్యింది. 1980 ప్రాంతంలో విలేజ్ స్టైల్ జీవన విధానం, అనుభూతులపై ప్రత్యేకంగా రూపొందించిన పల్లె వాతావరణం సెట్టింగ్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హరిలో రంగ హరి హరీ అంటూ ఇళ్లకు వచ్చే హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు, రచ్చబండ అరుగుపై చిలక జోస్యం చెప్పేవారు, సోది చెబుతామమ్మ.. సోది అంటూ ఇంటికి వచ్చే సోదెమ్మలు, విల్లంబు పట్టుకుని వేటాడే గిరిజనులు, మట్టి పాత్రలు తయారు చేసే కుమ్మరికుంటలు, గాలిపటాలు, హ్యాండీ క్రాఫ్ట్స్ షాపులు ఇలా అన్నీ ఒక్కచోట చేరి అసలైన సంక్రాంతి శోభను పరిచయం చేస్తున్నాయి. మరోవైపు కూచిపూడి నృత్య కళాకారులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించి సమ్మోహన పరుస్తున్నారు. – భవానీపురం(విజయవాడ పశ్చిమ)





న్యూస్‌రీల్

హెల్త్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బాల్ బ్యాడ్మింటన్ జట్టును ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ క్రీడా విభాగం కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తులు తెలిపారు. ఇటీవల విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులను జట్టుకు ఎంపికయినట్లు చెప్పారు. మంగళూరులోని మంగళూరు యూనివర్సిటీలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టు మేనేజర్‌గా ఆర్.గున్నజీ, కోచ్‌గా వి.వి.రామకృష్ణప్రసాద్ వ్యవహరిస్తున్నారన్నారు.

దుర్గమ్మకు బంగారు కాసుల పేరు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు తిరుపతికి చెందిన భక్తులు రూ. 2 లక్షల విలువైన బంగారు కాసుల పేరును కానుకగా సమర్పించారు. బుధవారం తిరుపతికి చెందిన ఆర్. సావిత్రమ్మ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి సుమారు 39 గ్రాముల బంగారంతో తయారు చేసిన కాసుల పేరును ఆలయ అధికారులకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందివ్వగా.. అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఆర్చర్ల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ ఆర్చరీ పోటీల్లో భాగంగా అండర్–14 ఇండియన్ రౌండ్ ర్యాంకింగ్‌లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఆర్చర్లు అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన పోటీల్లో 691/700 పాయింట్లతో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలవగా, మహారాష్ట్ర 681/700 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ర్యాంకింగ్ సాధించిన క్రీడాకారులు ఇండియన్ రౌండ్ వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీం విభాగాల్లో గురువారం తలపడతాయని నిర్వాహకులు, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. టీమ్ బాలుర విభాగంలో మహారాష్ట్ర, మణిపూర్, జార్ఖండ్, బాలికల విభాగంలో మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులను సాధించాయి.

కొండలమ్మ సేవలో కృష్ణా జేసీ



గుడ్లవల్లేరు: వేమవరంలో వేంచేసిన శ్రీకొండలమ్మ తల్లిని కృష్ణా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.

తూర్పులో దేశం తకరారు ఇందుకేనా!

- చేసింది చెప్పుకునేందుకు లేకనేనా యాగీ
- కళ్లెదుట అభివృద్ధి కనిపిస్తున్నందునే కంగారు
- వైఎస్సార్ సీపీ క్యాడర్‌కు సీఎం జగన్ దిశానిర్దేశంతో గద్దే వర్గీయుల్లో వణుకు
- సీనియర్లను కలిసి ఆశీర్వదించమంటున్న దేవినేని అవినాష్



కనకదుర్గ వారధి నుంచి భూపేష్ గుప్తా నగర్ వరకూ నిర్మించిన రిటైనింగ్ వాల్(ఫైల్)

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: చేసింది ఏమీ లేదు.. చెప్పుకునేందుకు ఏమీ కనిపించడం లేదు.. ప్రజల్లోకి వెళ్లడానికి ఏదో ఒక కారణం ఉండాలి.. అందుకే రచ్చను మార్గంగా ఎంచుకున్నారు విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు. ఇందుకు ప్రత్యేక కారణాలు లేకపోలేదంటున్నారు పరిశీలకులు. 'నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లండి. అందరినీ కలవండి. మనం చేసిన మంచిని చెప్పండి' అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం నాయకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాజాగా దిశానిర్దేశం చేశారు. గడప గడపకు కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం సూచనలతో మరింత ఉత్సాహంగా పార్టీ నాయకులు, శ్రేణులు 'తూర్పు'లో కలియ తిరుగుతున్నారు. మరీ ముఖ్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సీఎం మాటలే శిరోధార్యంగా అడుగులేస్తున్నారు. అందులో భాగంగానే తొలుత వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, సీనియర్ నేత బొప్పన భవకుమార్ ఇంటికి దేవినేని అవినాష్ స్వయంగా వెళ్లారు. తనతో పాటు కడియాల బుచ్చిబాబును వెంట తీసుకెళ్లి తనకు మనస్ఫూర్తిగా ఆశీస్సులు అందించాలని కోరగా.. 'నేను పార్టీ సామాన్య కార్యకర్తను. వైఎస్ జగన్ అభిమానిని. వ్యక్తిగత రాగద్వేషాలు లేవు. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నవాడిని.. సీఎం ఆదేశాలే నాకు శిరోధార్యం. మనం అందరం కలిసి పనిచేద్దాం. 175 నియోజకవర్గాల గెలుపు టార్గెట్ అయినప్పుడు 'తూర్పు' కూడా అందులో ఒకటి' అని బొప్పన స్పష్టమైన సమాధానం ఇవ్వడంతో పాటు పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయనేది సమాచారం. పార్టీలోని సీనియర్ నాయకులు అందరినీ అవినాష్ కలిసి ఏకతాటిపైకి తెస్తున్నారు. పార్టీలోని పెద్దలందరినీ కలుస్తా. అందరి ఆశీస్సులు పొందుతానని నమ్మకంగా చెబుతున్నారు. ఇవన్నీ తెలుసుకున్న గద్దె బృందం గొడవల కుట్రలతో పక్కదారి పట్టించాలనేది వారి ఎత్తుగడగా తెలిసింది.

తకరారు పెట్టుకునేది ఇందుకేనా..

టీడీపీ తరఫున తూర్పు ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్ గెలుస్తున్నప్పటికీ చెప్పుకోదగిన అభివృద్ధి అంటూ చేసింది ఏమీలేదు. టీడీపీకి కంచుకోట అని చెప్పుకుంటూ మాటల మనిషిగానే గద్దె మిగిలిపోయారు. అదే జగన్ ప్రభుత్వ హయాంలో ప్రగతి పనులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను చెబుతున్నందున టీడీపీకి దిక్కుతోచడం లేదు. పింఛన్ అడిగినందుకు పేద మహిళపై దాడిచేశారని తన పచ్చమీడియా ద్వారా అబద్ధాలను పదే పదే వల్లె వేయించినప్పటికీ వాస్తవాలను అవినాష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బాధితులుగా చెబుతున్న వారికి ఏయే విధంగా ప్రభుత్వ సాయం అందినదీ వివరంగా చెప్పడం పరిశీలనాంశం. అదే సమయంలో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి కళ్లకు కడుతోంది.

- తూర్పు నియోజకవర్గంలోని దాదాపు ముప్పయి వేల మందికి ఇల్లు, ఇంటి స్థలాలను ప్రభుత్వం అందజేస్తోంది. రాజధాని గ్రామాల్లో 8000 మందికి, తక్కిన 22 వేల మందికి వణుకూరు, ఉప్పులూరు, గొడవర్రు, వెదురుపావులూరులో ఇస్తోంది.
- తూర్పు పరిధిలోని కృష్ణా నది వెంబడి భూపేష్ గుప్తా నగర్ నుంచి రాణిగారితోట చివరి (వారధి) వరకు రూ.130 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయింది. రెండో దశలో రూ.125 కోట్లతో 22వ డివిజన్ పరిధిలో పనులు మొదలయ్యాయి. శాశ్వత అభివృద్ధి పనులు టీడీపీ గుండెల్లో గుబులు రేకెత్తించింది.
- గద్దె రామ్మోహన్ ఉంటున్న అయ్యప్పనగర్ మెయిన్ రోడ్డు రూ.కోటితో పనులు జరిగాయి. రూ.8 కోట్లతో అంతర్గత రోడ్ల పనులు దాదాపు ప్రతి డివిజన్‌లో కనిపిస్తున్నాయి.
- 28,000 మందికి అమ్మ ఒడి, కోట్లాది రూపాయలతో నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి, ఉర్దూ పాఠశాల నిర్మాణం తదితరాలు ప్రజల ఎదుట ఉన్నాయి.
- రామలింగేశ్వర్‌నగర్, అయ్యప్పనగర్, కామినేని నగర్, మారుతి కాలని, డెయిరీఫార్మ్ కాలనీలో సబ్‌స్టేషన్లు, గంగిరెద్దులదిబ్బ, ఆటోనగర్ కాలనీ, 22వ డివిజన్‌లో మూడు కోట్లతో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు, డివిజన్లలోని పార్కుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, డ్రెయినేజీల పనులు కొనసాగుతున్నాయి.
- బెంజిసర్కిల్ వద్ద రెండో ఫ్లైఓవర్ పూర్తయింది. బందరు రోడ్డు విస్తరణ తదితర ప్రగతి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవన్నీ కూడా టీడీపీకి రానున్న ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులే అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనేది పరిశీలకుల మాట.

చిరు వ్యాపారులకు తోడూనీడ

- ఎన్టీఆర్ జిల్లాలో 20,465 మందికి రూ. 57.65కోట్ల మేర లబ్ధి
- కలెక్టర్ ఢిల్లీరావు



లబ్ధిదారులకు జగనన్న తోడు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న తోడు పథకం చిరువ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారి ఉపాధికి వరం లాంటిదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి లబ్ధిదారుల ఖాతాలకు బటన్ నొక్కి వడ్డీ మొత్తాన్ని జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులతో కలిసి ప్రత్యక్షప్రసారాన్ని వీక్షించిన అనంతరం లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కును కలెక్టర్ అందజేశారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25,465 మంది చిరు వ్యాపారుల, సంప్రదాయ చేతి వృత్తుల వారికి రూ.57.65 లక్షల వడ్డీని లబ్ధిదారుల ఖాతాలో జమచేశామన్నారు. జగనన్న తోడు ద్వారా చిరువ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంలో భాగంగా వడ్డీని లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామన్నారు. వ్యాపారం నిమిత్తం ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇబ్బందులు పడకుండా జగనన్న తోడు పథకం ద్వారా ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణ సహాయం కల్పిస్తోందన్నారు. బ్యాంకుల నుంచి చిరు వ్యాపారులు తీసుకున్న రుణాలకు వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. జగనన్న తోడుతో చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తి దారుల కళ్లలో ఆనందం చూడగలుగుతున్నామన్నారు.

మరొక అవకాశం..

అర్హత ఉండి జాబితాలో పేర్లు నమోదు కాని వారు గ్రామ, వార్డు వలంటీర్‌లను సంప్రదించి సంబంధిత సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వ్యాపారస్తులు తీసుకున్న ఆర్థికసాయాన్ని సకాలంలో బ్యాంకులకు చెల్లించి తిరిగి ఆర్థిక సాయం పొందాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 46,618 మంది లబ్ధిదారులకు రూ. 46.62 కోట్లను ఆర్థికంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి. గౌతంరెడ్డి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్, ఎల్‌డీఎం పి. కోటేశ్వరరావు, మెప్మాపీడీ ఎస్ఎన్ విశాలాక్షి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి కె. అనురాధ పాల్గొన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

గుడివాడ టౌన్: సంక్రాంతి సందర్భంగా స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్ నగర్‌లో 'ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు జాతీయస్థాయి పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ రెండు పళ్ల విభాగం ఎడ్ల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి అంటే గుడివాడ ఎడ్ల పోటీలు గుర్తుకొచ్చేలా ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), ఆయన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు (చిన్ని) నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన ఒంగోలు జాతి ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయంటే వాటి ప్రత్యేకత ఏంటో అర్థం అవుతోందన్నారు. ఒంగోలు జాతి పశు సంపద అంతరించకుండా రైతులను ప్రోత్సహించేందుకు ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కొడాలి నాని, ఆయనకు సహకరిస్తున్న సహచర బృందానికి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు పాలడుగు రామ్ ప్రసాద్, దుక్కిపాటి శశిభూషణ్, రూరల్ మండల ఎంపీపీ గద్దె పుష్పరాణి పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు..

రెండు పళ్ల విభాగంలో ఎనిమిది జతల ఎడ్లు తలపడ్డాయి. ఎనిమిది విభాగాల్లో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.30 వేలను వల్లభనేని మోహనరావు, ఉప్పల లక్ష్మయ్య ఎడ్ల జత దక్కించుకుంది. రెండో బహుమతి రూ.25 వేలను కల్లూరి ప్రవీణ్‌కుమార్ ఎడ్లు, మూడో బహుమతి రూ.22 వేలను పిల్లి గడ్డ బాల సైదా ఎడ్లు, నాల్గో బహుమతి రూ.18 వేలను గూడవల్లి లక్ష్మీదీక్షిత ఎడ్లు, ఐదో బహుమతి రూ.15 వేలను పోషం గోవర్ధనరెడ్డి ఎడ్లు, ఆరో బహుమతి రూ.13 వేలను ఒగురు చినసుబ్బారాయుడు ఎడ్లు, ఏడో బహుమతి రూ.10 వేలను బారు గీతికా నాయుడు ఎడ్లు, ఎనిమిదో బహుమతి రూ.8 వేలను గరికిపాటి శ్రీధర్ ఎడ్లు కైవసం చేసుకున్నాయి.

విష వలయం

విజయవాడలో అలజడి సృష్టిస్తున్న చైల్డ్ పోర్న్ వీడియోలు

- చిన్నారుల మానసిక స్థితిపై ప్రభావం
- వీడియోలు చూసి అడ్డదారులు తొక్కుతున్న యువత
- దర్యాప్తు సంస్థల సహకారంతో నిందితులపై చర్యలు
- మూడేళ్లలో విజయవాడలో 1,600 మందిపై కేసుల నమోదు



విజయవాడ స్పోర్ట్స్: చిన్నారులను దైవంతో సమానంగా చూసేవారు.. ఆడపిల్లలనైతే లక్ష్మీదేవితో పోల్చేవారు. పాశ్చాత్య సంస్కృతి, టెక్నాలజీతో చిన్నారుల నీలి చిత్రాలు (చైల్డ్ పోర్నోగ్రఫీ) సమాజానికి పెను సవాల్‌గా మారాయి. ఈ వీడియోలు నిరంతరం చూసే వ్యక్తులు చిన్నారులను సైతం లైంగిక వస్తువుగానే చూస్తున్నారు. ప్రస్తుతం చిన్నారులపై జరిగే లైంగిక దాడులకు ఈ చిత్రాలే కారణమవుతున్నట్లు పోలీసులు, మానసిక వైద్యులు చెబుతున్నారు. గత ఏడాది కొండపల్లిలో పదేళ్ల బాలుడిపై, సింగ్‌నగర్‌లో ఏడేళ్ల బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన వ్యక్తులు ఈ చిత్రాలనే అధికంగా చూసేవారని పోలీసుల దర్యాప్తులో తేలింది. చైల్డ్ పోర్న్ వీడియోలు చూసి ప్రేరేపితులై సమీపంలో ఉన్న 14 ఏళ్ల లోపు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

నిషేధం ఉన్నా.. అందుబాటులోనే

చైల్డ్ పోర్న్ వీడియోలను భారత ప్రభుత్వం నిషేధించింది. వీడియోలు చిత్రీకరించినా, చూసినా, సామాజిక మాధ్యమాల ద్వారా వేరే వ్యక్తులకు పంపినా, ఫోన్‌లో వీడియోలను కలిగి ఉన్నా కఠిన శిక్షలు విధించేలా చట్టం తీసుకొచ్చింది. అయినా ఈ వీడియోలను నిరంతరం, నిరభ్యంతరంగా చూసేందుకు కొన్ని నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆండ్రాయిడ్ యూజర్లకు అనేక ఆప్షన్లు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం ఈ వీడియోలు చూసే వారి సంఖ్య గణనీయంగా ఉంది.

మూడో కన్ను చూస్తోంది..

వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ ఎక్స్‌ప్లేటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ) అనే నోడల్ ఏజెన్సీని నెలకొల్పింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీఐడీ), నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) కనుసన్నల్లోనే ఈ నోడల్ ఏజెన్సీ పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా చైల్డ్ పోర్న్ వీడియోలు ఎక్కడ చిత్రీకరణ జరుగుతోంది? ఎవరు చూస్తున్నారు? ఏయే మాధ్యమాల ద్వారా ఇతరులకు వెళ్తున్నాయి? ఎవరి దగ్గర ఈ వీడియోలు ఉన్నాయనే విషయాలను ఈ ఏజెన్సీ పసిగడుతోంది. సేకరించిన సమాచారాన్ని జీపీఎస్ ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని సైబర్ పోలీసులకు సీడీల రూపంలో సమాచారాన్ని అందిస్తోంది.

విజయవాడ నగరంలో అధికమే..

ఎన్‌సీఎంఈసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా 2020 నుంచి విజయవాడలో చైల్డ్ పోర్నోగ్రఫీ అధికమైనట్లు సైబర్ పోలీసులు చెబుతున్నారు. గడిచిన మూడేళ్లలో స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్, ట్యాబ్‌లలో ఈ వీడియోలు చూస్తూ, ఇతరులకు పంపిస్తున్న వ్యక్తులను 1600 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెబుతున్నారు. 2020, 2021తో పోల్చితే 2022 ఈ తరహా కేసులు అధికమయ్యాయి. నగరంలో పనుల కోసం రాజస్థాన్, బీహార్, జార్ఖండ్ ప్రాంతాల నుంచి వచ్చిన వారిపైనే అధికంగా కేసులు నమోదయ్యాయి. ఫోన్‌లో అత్యధిక సమయంలో పోర్న్ వీడియోలు చూడటం, అటుగా వచ్చే చిన్నారులను లైంగిక వాంఛతో చూడటం జరుగుతున్న నేపథ్యంలో ఎన్‌సీఎంఈసీ నివేదిక ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

వెంటనే కేసులు నమోదు



ఎన్‌సీఎంఈసీ ఏజెన్సీ నుంచి వచ్చిన వివరాల ప్రకారం విజయవాడ నగరంలో నిందితులను గుర్తిస్తున్నాం. ముందుగా వారికి నోటీసులు ఇచ్చి తరువాత ఐటీ యాక్ట్ 67 (బి) ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. పోర్న్ వీడియోలు చూసినా, ఫేస్‌బుక్, వాట్సాప్, యూ ట్యూబ్, టెలిగ్రాం, స్నాప్‌చాట్, మోజ్ తదితర మాధ్యమాల ద్వారా ఇతరులకు పంపినట్లు కోర్టులో రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష పడుతుంది. పిల్లలు ఫోన్‌లో ఏం చూస్తున్నారు? ఇతరుల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారు? అనే విషయాలను వారి తల్లిదండ్రులు గమనిస్తుండాలి.

– యేలేటి శ్రీరచన, ఎస్ఐ, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ , విజయవాడ

ఇంధనం పొదుపుతో ఆర్టీసీకి ఆదాయం

ఎన్టీఆర్ జిల్లా రవాణా అధికారి వై. దానం



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తుందని ఎన్టీఆర్ జిల్లా రవాణా అధికారి వై. దానం అన్నారు. బుధవారం సాయంత్రం ఆటోనగర్ ఆర్టీసీ డిపో ఆవరణలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వై.దానం మాట్లాడుతూ 2020–21 సంవత్సరానికి స్టేట్ లెవెల్ ఇంధన పొదుపులో ఉత్తమ డిపోగా ఆటోనగర్ డిపో నిలిచింది. ఈ మేరకు పెట్రోలియం కన్సమ్షన్ రీసెర్చ్ అసోసియేషన్ (పీసీఆర్ఏ) ప్రకటించింది. ఈ ఏడాదిలో ఆటోనగర్ డిపో 2,08,347 లీటర్ల డీజిల్ ను పొదుపు చేసిందన్నారు. దీని ద్వారా రూ.2.4 కోట్లు ఆదాయం మిగిలిందన్నారు. డ్రైవర్, మెకానిక్‌ల నైపుణ్యం కారణంగా ఆయిల్ ఆదా చేశారన్నారు. ముమ్ముందు కూడా ఇదే విధంగా ఇంధనం పొదుపు చేసే విధంగా పని చేయాలన్నారు. అనంతరం 40 మంది మెకానిక్, డ్రైవర్‌లకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీఎంకే ప్రవీణ్‌కుమార్, డెప్యూటీ చీఫ్ మెకానిక్‌లు నీలిమ, జాన్ సుధాకర్, విజయవాడ డిపో మేనేజర్ శ్రీనివాసశర్మ, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 24 మంది జూదరుల అరెస్ట్
- రూ.1,56,550 నగదు, 24 మొబైల్స్ స్వాధీనం

గన్నవరం: గుట్టుచప్పుడు కాకుండా నివాస ప్రాంతాల్లో నడుస్తున్న ఆర్గనైజింగ్ పేకాట శిబిరంపై మంగళవారం అర్ధరాత్రి సబ్ డివిజన్ పోలీస్ టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడిచేసి 24 మంది జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం...కొంతకాలంగా స్థానిక గౌడపేటతో పాటు వీఎస్ పురం కాలనీలో ఆర్గనైజింగ్ పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. వీటిపై ప్రత్యేక నిఘా పెట్టిన సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల బృందం గౌడపేటలోని కూరగాయల వ్యాపారి శ్రీను ఇంటిలో జరుగుతున్న పేకాట శిబిరంపై అర్ధరాత్రి మెరుపు దాడిచేశారు. పేకాడుతున్న 24 మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ.1,56,550 నగదు, 24 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జూదరులను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. సదరు నిర్వాహకుడు గతంలో వీఎస్ పురం కాలనీలో నిర్వహించిన పేకాట శిబిరంపై కూడా గతనెల సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడిచేసి కేసు నమోదు చేయడం గమనార్హం. స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని కొంత మంది అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఈ ఆర్గనైజింగ్ పేకాట శిబిరాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.విజయపాల్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ జూద శిబిరాలపై దాడులు చేసినట్టు తెలుస్తోంది.

నేటి నుంచి మారిన మెనూ అమలు చేయాలి

డీఈఓ తాహెరా సుల్తానా

పెడన: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చామని, మార్చిన మెనూను ఈ నెల 12వ తేదీ నుంచి అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా తెలిపారు. మారిన మెనూను ఎంఈఓలు, హెచ్ఎంలు పర్యవేక్షించి తప్పకుండా అమలు చేయాల్సిందిగా ఆమె ఆదేశించారు. సోమవారం హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు లేదా కూరగాయల పలావు, కోడిగుడ్డు కూర, చిక్కీ పెట్టాలన్నారు. మంగళవారం చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు పెట్టాలన్నారు. బుధవారం కూరగాయల అన్నం, బంగాళదుంప కూర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ, గురువారం సాంబారు బాత్, ఉడికించిన కోడిగుడ్డు లేదా నిమ్మకాయ పులిహోర, టమాట పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, శుక్రవారం ఉడికించిన అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ, శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపిపొంగలి పెట్టాలని డీఈఓ పేర్కొన్నారు. శనివారం పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీన కాలానుగుణంగా ఆకుకూరలు పెట్టాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

విదేశాలకు వెళ్లాల్సిన యువకుడు విగతజీవి అయ్యాడు

నందిగామ/వత్సవాయి: మరికొద్ది సేపట్లో ఉన్నత విద్య కోసం లండన్ బయలుదేరి వెళ్లవలసిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం నందిగామ శివారు హనుమంతుపాలెంకు చెందిన గాడిపర్తి వెంకటనారాయణ కొంతకాలంగా నందిగామ పట్టణంలో నివాసం ఉంటున్నారు. వెంకటనారాయణ, రాణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గోపీకృష్ణ లండన్‌లో ఉన్నత చదువులు చదువుతున్నాడు. రెండవ కుమారుడు గాడిపర్తి శివకృష్ణ (24) గత ఏడాది బీటెక్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉన్నత చదువుల కోసం బుధవారం తెల్లవారుజామున లండన్ బయలుదేరేందుకు హైదరాబాదు వెళ్లవలసి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సుమారు 3:30 గంటల సమయంలో తన మిత్రులను కలిసి వస్తానని చెప్పి శివకృష్ణ ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్ విమానాశ్రయానికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు అంతా సిద్ధం చేశారు. బయటికి



శివకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



శివకృష్ణ (ఫైల్)

వెళ్లిన శివకృష్ణ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీనికి తోడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళనతో మిత్రులను ఆరా తీశారు. అయినా ఆచూకీ తెలియలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నవాబుపేట సమీపంలోని పొలాల్లో చెట్టుకి ఉరివేసుకొని ఓ యువకుడి మృతదేహం కనిపించడంతో అటుగా వచ్చిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే తమ కుమారుడి కోసం వెతుకుతున్న వెంకటనారాయణ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడు శివకృష్ణగా గుర్తించారు. దీంతో వత్సవాయి పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు

లండన్ వెళ్లి ఉన్నత చదువులు చదువుకోవాల్సిన శివకృష్ణ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరి కొద్దిసేపట్లో బయలుదేరవలసిన తమ కుమారుడు ఎందుకు మృతి చెందాడో కూడా కుటుంబ సభ్యులకు అర్థం కాక తలలు బాదుకుంటున్నారు.

ఎమ్మెల్యే,ఎమ్మెల్సీల పరామర్శ

శివకృష్ణ మృతదేహానికి బుధవారం నందిగామ పట్టణంలో పంచనామా నిర్వహించారు. శివకృష్ణ మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. ఉన్నత చదువులకు లండన్ వెళ్లవలసిన శివకృష్ణ మృతి చెందడం బాధాకరమన్నారు.



క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌ను బుధవారం కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించిన సీఎం జగన్



క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌ను కలిసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించిన సీఎం జగన్, హాజరైన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి

31 కిలోల గంజాయి స్వాధీనం

గుడివాడరూరల్: పట్టణంలో సెబ్ అధికారులు చేసిన తనిఖీల్లో 31కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ పెద్దిరాజులు తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన దక్షిణాది కుమార్ అనే యువకుడు కాకినాడ నుంచి నెల్లూరుకు రైలు ద్వారా తెల్లవారు జామున గంజాయి తరలిస్తున్నాడన్న సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని బ్యాగ్‌లో తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.లక్ష విలువైన 31 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు వివరించారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి విక్రయాలు చేపడితే సంబంధిత ప్రాంతాల ప్రజలు తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని మీడియాకు చూపిస్తున్న సెబ్ సీఐ పెద్దిరాజులు, సిబ్బంది

బైక్ అదుపు తప్పి వాగులో పడి వ్యక్తి మృతి

చింతలపాడు(తిరువూరు): మండలంలోని చింతలపాడులో ఓ వ్యక్తి ద్విచక్రవాహనం నడుపుతూ అదుపు తప్పి వాగులో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన అలవాల రంగారెడ్డి(50) మంగళవారం రాత్రి చింతలపాడు వస్తుండగా బైక్ అదుపుతప్పి వాగులోకి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన రంగారెడ్డి రాత్రి వేళ ఎవరూ గమనించకపోవడంతో సకాలంలో వైద్యం అందక మృతిచెందాడు. బుధవారం ఉదయం గ్రామస్తులు వెదకగా అతని మృతదేహం వాగు తుప్పల్లో లభ్యమైంది. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

స్కూలు అసిస్టెంట్ పోస్టులో అర్హులైన ఎస్జీటీలు

పెడన: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో అవసరం ఉన్న స్కూలు అసిస్టెంట్ స్థానాల్లో అర్హులైన సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను నియమించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు కోరామని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా పేర్కొన్నారు. ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్సు బోధించే వారికి నెలకు రూ.2,500 టీచర్ అలవెన్సు ఇస్తామన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రభుత్వ, జెడ్పీలలో పనిచేస్తున్న ఎస్జీటీలు సబ్జెక్టుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలతో పాటు సర్వీసు రిజిస్టర్లతో పరిశీలన నిమిత్తం మచిలీపట్నం డీఈవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు హాజరుకావాల్సిందిగా సూచించారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు బుధవారం ముగిశాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యపోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు కనుమరుగవుతున్న తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను సమాజానికి గుర్తు చేసేందుకు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఇంతటి చక్కటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, స్టేడియం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

అంబేడ్కర్ వర్సిటీ సెమిస్టర్ ఫీజు చెల్లింపునకు 18 చివరి తేదీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్ష రుసుము ఈనెల 18వ తేదీలోపు చెల్లించాలని వర్సిటీ స్టడీ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.అజంత కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు పేపర్‌కు రూ.150 చొప్పున, సైన్స్ విద్యార్థులు ఫీజుతో పాటు ప్రయోగ పరీక్షలకు రూ.150 చెల్లించాలన్నారు. సెమిస్టర్-1 పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి 17వరకు, సెమిస్టర్-3 పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి 26 వరకు సెమిస్టర్-5 పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు జరుగుతాయన్నారు. పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కోసం మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో స్వయంగా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

సత్తా చాటుతున్న బౌలర్లు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అండర్-14 అంతర్ జోన్ మల్టీడే మ్యాచ్‌లలో బౌలర్లు సత్తా చాటుతున్నారు. మూలపాడులోని ఏసీఏ మైదానంలో సెంట్రల్‌జోన్, కంబైన్డ్ జోన్‌లకు బుధవారం జరిగిన మ్యాచ్‌లోనూ బౌలర్ల హవా కొనసాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కంబైన్డ్ జోన్ మధ్యాహ్నం సమయానికి 61.5 ఓవర్లకు 151 పరుగులు చేసి ఆల్ ఔటైంది. సెంట్రల్ జోన్ బౌలర్లు ఆర్.సుజిత్ కుమార్‌రెడ్డి నాలుగు, బి.ఎస్.ఎస్.శరత్ మూడు వికెట్లు తీశారు.అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లకు రెండు వికెట్లు నష్టపోయి 77 పరుగులు చేసింది.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

రూ.6.30లక్షల జరిమానా

గూడూరు: గూడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గృహాలు, వాణిజ్య సముదాయాలలో నిర్వహించిన తనిఖీలలో రూ.6.30 లక్షల జరిమానాలు విధించామని విజయవాడ విజిలెన్స్ విభాగం ఈఈ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మచిలీపట్నం ఈఈ ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో 39 బృందాలు 1660 గృహ సర్వీసులు, 10 వాణిజ్య సముదాయాలన తనిఖీ చేయగా వాటిలో 173 సర్వీసులకు అదనపు లోడు 315 కిలోవాట్లకు గాను రూ.6.30 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖాధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో ఏడీలు కె.రామకృష్ణ, కృష్ణారెడ్డి, మాణిక్యాలరావు, సుబ్బారావు, మచిలీపట్నం 1,2,3, రూరల్, చిన్నాపురం, పామర్రు, పమిడిముక్కల, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను ఏఈలు పాల్గొన్నారు.

తోటి వారితో సోదర భావంతో ఉండాలి

ఉంగుటూరు: తోటివారితో సోదరభావంతో ఉంటే దేవుని ప్రేమకు పాత్రులవుతారని ఏలూరు మేత్రాసనం, జానంపేట ఫాదర్ సుందర్‌రాజు అన్నారు. పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు బుధవారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ఫాదర్ సుందర్ రాజు స్థానిక ఫాదర్లతో కలసి దివ్య పూజాబలిని సమర్పించి దేవుడు మానవజాతిని తన పోలికలో సృజించేను అను అంశంపై బోధించారు. క్రైస్తవులు కేవలం తోటి క్రైస్తవులనే కాకుండా అందరినీ సోదర భావంతో చూసి, సామరస్యంగా జీవించాలని బోధించారు. ఇతరులను ప్రేమించడం ద్వారానే దేవుడిని ప్రేమించడం సాధ్యమవుతుందని చెప్పారు. జోసఫ్ తంబి అన్ని మతాల వారిని సమానంగా చూసేవారని, అందుకే నేటికీ ఆయన సమాధిని కుల మతాలకు అతీతంగా సందర్శిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఫాదర్ మైకేల్, ఫాదర్ ప్రవీణ్, మరియన్న, సంఘస్తులు పాల్గొన్నారు.



దివ్య పూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు సుందర్‌రాజు,మైకేల్, మరియన్న

మచిలీపట్నంలో హోటల్ చెఫ్ ఆత్మహత్య

కోనేరుసెంటర్(మచిలీపట్నం): హోటల్‌లో చెఫ్‌గా పనిచేసే ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్.పేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రు మండలం కురుమద్దాలి గ్రామానికి చెందిన కుక్కల మోహనరావు (22) మచిలీపట్నంలో హ్యాపీబే హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన ఓ యువతితో మోహనరావుకు ప్రేమ వ్యవహారం నడుస్తోంది. పది రోజుల క్రితం మోహనరావు ఆ యువతిని మచిలీపట్నం తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల పెద్దలు మందలించి ఆ యువతిని తల్లిదండ్రుల వద్దకు పంపించారు. అప్పటి నుంచి మోహనరావు అదే ధ్యాసలో అన్యమనస్కంగా ఉంటున్నాడు. దీంతో అతని కుటుంబసభ్యులు యువతి బంధువులతో మాట్లాడి వివాహం జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి విధులు ముగిసిన అనంతరం మోహనరావు హోటల్‌లోని ఓ గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున హోటల్ యజమాని గంపల శ్రీహర్ష హోటల్‌కు వెళ్లి తలుపు తట్టగా మోహనరావు బయటికి రాలేదు. అనుమానం వచ్చిన అతను కిటికీలో నుంచి చూడగా మోహనరావు ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో తన వద్ద ఉన్న తాళంతో డోర్ తీసి లోపలికి వెళ్లి ఫ్యానుకు వేలాడుతున్న మోహనరావును కిందికి దింపాడు. పోలీసులకు జరిగిన విషయాన్ని తెలియజేశాడు. సీఐ కొండయ్య, ఎస్ఐ సుబ్బారావు హోటల్ వద్దకు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబసభ్యులకు సమాచారం అందజేయడంతో వారు హుటాహుటిన మచిలీపట్నం చేరుకుని విగతజీవిగా పడి ఉన్న మోహనరావును చూసి భోరున విలపించారు. మృతుని సోదరుడు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.